క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



నెహ్రూనగర్: కంకరగుంట వెల్ఫేర్ అసోసియేషన్, ఆదిత్య హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి హాజరై ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు కుందనాటి సంజయ్‌బాబు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవ లందించాలనే సదుద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లింగాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి కిషోర్, హాస్పిటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా చేపట్టాలి

నెహ్రూనగర్: ఈనెల 21 నుంచి ఆగస్ట్ 21 వరకు జరిగే డోర్ టు డోర్ ఓటర్ల సర్వేలో నగరపాలక సంస్థ పరిధిలోని బీఎల్‌ఓలు సమగ్రంగా సర్వే చేయడానికి వీలుగా పోలింగ్‌స్టేషన్ల బౌండరీలు మ్యాప్ అందించాలని అదనపు కమిషనర్ పెద్ది రోజా రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరంలో చేపట్టే సర్వేపై పట్టణ ప్రణాళిక అధికారులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు తమకు కేటాయించిన పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా చెక్ చేస్తారన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



నెహ్రూనగర్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని నగర ప్రజలు ఎటువంటి అపోలకు గురి కావద్దని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం తెలియజేశారు. 19 వార్డ్ సచివాలయం వద్ద పింఛన్ రద్దు చేయడం, వలంటీర్లు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చేసినట్లు తెలిసిన వెంటనే కమిషనర్ స్పందించి వివరాలు పంపాలని నోడల్ అధికారిని ఆదేశించారు. నోడల్ అధికారి విచారణ మేరకు పింఛన్ కోసం మే 9 న అర్జీదారు దరఖాస్తు చేసుకున్నారని, సచివాలయ కార్యదర్శి ఫీల్డ్ ఎంక్వయిరీ చేసి అర్హులు అని రిపోర్ట్ చేసి... తమ లాగిన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా మే 10న ఎంపీడీఓ /ఎంసీ లాగిన్‌కు పంపడమైనదన్నారు. అదేరోజు ప్రభుత్వ అనుమతి కోసం ఎంసీ లాగిన్ నుంచి సిఫార్స్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నూతన పింఛన్‌లు బై యాన్యువల్ శాంక్షన్ ఇస్తుందన్నారు. ఇందులో నగరపాలక సంస్థ వైపు నుంచి పింఛన్ ఆమోదం చేసి ప్రభుత్వంకు పంపడంలో ఎక్కడా జాప్యం లేదని ప్రజలు అపోహలకు గురికావద్దని కోరారు.

బాలుడి కడుపులో నాలుగు అయస్కాంతాలు వెలికితీత



బాలుడితో డాక్టర్ యర్రాస్ రాజేష్

గుంటూరు మెడికల్: ఆటలాడుతూ ఆడుకునే వస్తువులను మింగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఓబాలుడికి యర్రాస్ హాస్పటల్‌లో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి బాలుడి ప్రాణాలు కాపాడామని పిల్లల శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ యర్రా రాజేష్ చెప్పారు. శనివారం స్థానిక కొత్తపేటలోని యర్రాస్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన షేక్ హసీమ్‌వలి, శరాబ్బి దంపతుల తొమ్మిదేళ్ల కుమారుడు షేక్ మొహమ్మద్ రఫీని ఈనెల 8న చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. బాలుడికి కడుపులో నొప్పి, పసరు వాంతులు అవడంతో మార్కాపురం, ప్రకాశం జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో వైద్యులు పరీక్షలు చేసి తమ వద్దకు రిఫర్ చేశారన్నారు. బాలుడికి ఎక్సెరే, అల్ట్రాసౌండ్ పరీక్ష చేయగా, కడుపులో నాలుగు అయస్కాంతాలు ఒకదానికొకటి అత్తుకుని ఉండటం గుర్తించామన్నారు. అయస్కాంత శక్తి వల్ల పేగు మెలిక పడి ఉందని, అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని నిర్ణయించామన్నారు. ఈనెల 8న సుమారు 2 గంటల సేపు ఆపరేషన్ చేసి చిన్నపేగులో మూడు చోట్ల, పెద్దపేగులో ఒకచోట అయస్కాంత ఆకర్షణ వల్ల రంధ్రాలు పడి ఉండటాన్ని గమనించామన్నారు. మొత్తం నాలుగు రంధ్రాలను బాగు చేశామన్నారు. రంధ్రాలు పడడంతోపాటు పేగుల్లో పలురకాల ప్లాస్టిక్, రబ్బరు వస్తువులు, విత్తనాలు సైతం బాలుడి కడుపులో ఉన్నాయన్నారు. లోపల ఉన్న వస్తువులన్నీ బయటకు తీసి పేగును సరిచేశామన్నారు. సకాలంలో ఆపరేషన్ చేయకపోతే పేగులు పూర్తిగా పాడై పిల్లాడి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడేదన్నారు. సుమారు నెలక్రితం బాలుడు బటన్ బ్యాటరీలు మింగాడని, తల్లిదండ్రులు మోషన్ ద్వారా బయటకు వస్తాయని నిర్లక్ష్యం చేసి చివరి దశలో తమ వద్దకు వచ్చారన్నారు. ఎండోస్కోపి ద్వారా తీయలేని పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న వస్తువులు బయటకు తీశామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో మత్తువైద్య నిపుణుడు డాక్టర్ వైసురేంద్ర, డాక్టర్ అళ్ల శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ పవన్ తిరుమలేష్, డాక్టర్ మౌనిక పాల్గొన్నట్లు వెల్లడించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవ్రజ బాబు అన్నారు. శనివారం 51 డివిజన్ శ్రీనగర్ పుట్టరోడ్డులో సీసీ డ్రెయిన్‌లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.27.70 లక్షల అంచనాలతో శంకుస్థాపన చేశారు. డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ 50వ డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా పనులు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పన ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

కేర్‌వెల్‌లో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: లివర్ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించే ఫైబ్రో స్కాన్‌ను శనివారం స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని కేర్‌వెల్ హాస్పటల్‌లో ఉచితంగా చేశారు. వైద్య శిబిరంలో 80 మందికి ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశామని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ నాగూర్‌బాషా చెప్పారు. ప్రతినెలా పేదలకు తమ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన రూ. 10వేలు ఖరీదు చేసే స్కానింగ్‌ను ఉచితంగా చేస్తున్నామన్నారు. ప్రజలకు లివర్ వ్యాధి, జీర్ణకోశ వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే ఉచిత వైద్య శిబిరం మరోసారి నిర్వహిస్తామన్నారు.

శాకంబరీ.. నమోనమః



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ మనోహర్ నాయుడు



శాకంబరిగా దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు

స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ రావు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నిడమానూరు సురేష్, బోర్డు మెంబర్స్ కనమర్లపూడి మారుతి శివ వెంకట సుబ్బారావు, దేవరశెట్టి సురేష్ బాబు, బైసాని ఇందుమతి, కొలిశెట్టి రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్. నూరి ఫాతిమా, ఆలయ ఈఓ దుర్గారావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

– పాత గుంటూరు

జీజీహెచ్‌కు వస్తూ.. ఆధార్ కార్డు తెచ్చుకోండి



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అవుట్ పేషెంట్ విభాగంలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. తద్వారా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాలు రోగులకు త్వరితగతిన అందేందుకు దోహదపడుతోందన్నారు. శనివారం ఆసుపత్రిలో ఓపీ కౌంటర్‌లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో రోగులు తమ పేర్లు నమోదు చేసుకోవడంలో జాప్యాన్ని నివారించేందుకు ఆధార్ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

దాతలు ముందుకు రావాలి

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో డీఆర్‌డీపీ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ సమక్షంలో రూ.40 వేలు విలువ చేసే ఔషధాలను శనివారం సూపరింటెండెంట్ అందజేశారు. ఆసుపత్రిపై ఉన్న మమకారంతో రోగులకు ఉచితంగా అందజేందుకు మందులు అందజేసిన డీఆర్‌డీపీ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో 30 ఏళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఉస్మాన్ ట్యూబ్‌లైట్లు ఆసుపత్రికి బహూకరించడంతో డాక్టర్ కిరణ్‌కుమార్ సదరు ఉద్యోగిని అభినందించారు. గుంటూరు జీజీహెచ్‌లో వ్యాపారాలు చేస్తున్న నిర్వాహకులు అపరిశుభ్ర వాతావరణం కల్పిస్తున్నారని, తద్వారా చెడు సంఘటనలు జరిగే ప్రమాదం ఉందని సూపరింటెండెంట్ అన్నారు.. షాపుల నిర్వాహకులు తమ నిర్దేశించిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, వ్యర్థాలను సక్రమమైన రీతిలో నిర్వీర్యం చేయకపోతే ఎలుకలు, పందికొక్కులు తిరిగే ప్రమాదం ఉందన్నారు. వ్యాపారస్తులు ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచి ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలన్నారు. సూపరింటెండెంట్ వెంట సివిల్‌సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

గుంటూరుఈస్ట్: నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి కోరారు. బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో వెస్ట్ డివిజన్ పరిధిలోని హోటల్స్, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, యజమానులు, మేనేజర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. నేరస్తులకు రూములు ఇవ్వకుండా పోలీసు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సీసీ కెమెరాలు, మెటల్ డిటెక్టర్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కస్టమర్ వివరాలు నమోదు చేసుకోవడంతోపాటు, అతని గుర్తింపు కార్డు నకలు తీసుకోవాలని సూచించారు. వారి వివరాలు ఎప్పకటిప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేదలను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్



పట్నంబజారు: పేదలను ఆదుకుని అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలిచే విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలో ఆయన కార్యాలయంలో రూ. 9.20 లక్షలు చెక్కులను ఏడుగురికి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. దానిలో భాగంగానే పేదలకు వైద్యం అనంతరం సహాయంగా నిలిచేలా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఈస్ట్: పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్ధన్‌రెడ్డిని నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర శివారు కాలనీల్లో, విలీన గ్రామాల్లో లో వోల్టేజీ సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నాయన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మార్లు, సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతాల్లో పేద ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటారని, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట అదనపు విద్యుత్ స్తంభాలు, నూతన వైర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారత్‌రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీకృష్ణ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన విద్యార్థులకు సమాజంలో తగు గుర్తింపు ఉంటుందని ఏఎన్‌యూ ఎంబీఏ విభాగ డీన్ ఆచార్య రామినేని శివరామ ప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ల ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామప్రసాద్ మాట్లాడుతూ శ్రద్ధతో చదివి, మంచి నడవడిక సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవడం ద్వారా ఉజ్వల భవితను అందిపుచ్చుకోగలరన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఏఎన్‌యూ ప్రకటించిన ప్రథమ సంవత్సర ద్వితీయ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టీడీ విమల తన భర్త దివంగత డాక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పేరుతో స్మారక ప్రోత్సాహక నగదు బహుమతులను ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎంబీఏ విభాగంలో సీహెచ్ కాత్యాయిని, ఎస్. దుర్గాప్రసాదరావు, పి. నగీనా, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పి. మేఘన చౌదరి, వి. శ్రావ్య, షేక్ హసన్‌వలీ తొలి మూడుస్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, సీహెచ్ వైష్ణవి, ఎ. బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంఠ, బి. అనిత, అభిలాష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచితంగా ఐదుగురు చిన్నారులకు ప్లాస్టిక్ సర్జరీ

గుంటూరు మెడికల్: ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డేను పురస్కరించుకుని శనివారం గుంటూరు అరండల్‌పేట పదోలైనులోని అమేజ్ మెడ్‌స్పా అండ్ ప్లాస్టిక్ సర్జికల్ సెంటర్‌లో డాక్టర్ సుమితా శంకర్ ఆధ్వర్యంలో ఐదులురు చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్ చేశారు. శనివారం స్థానిక అరండల్‌పేటలోని ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ గ్రహణం మొర్రితో బాధపడుతున్న ఇరువురు చిన్నారులు, నరాల సమస్యతో బాధపడుతున్న చిన్నారికి, రక్తనాళాల్లో కణితో బాధపడుతున్న చిన్నారికి, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఒక్కొక్కరికీ సుమారు రూ. లక్ష ఖరీదు చేసే ఆపరేషన్‌లు ఉచితంగా చేసి మందులు కూడా అందజేసినట్లు డాక్టర్ సుమితా శంకర్ చెప్పారు. ప్లాస్టిక్ సర్జరీ అంటే కాస్మోటిక్ సర్జరీ మాత్రమే కాదని, పాస్టిక్ సర్జరీపై వైద్య నిపుణుల్లో సైతం సరైన అవగాహన లేదన్నారు. ప్రతి ఇంటికి ప్లాస్టిక్ సర్జరీ చేరవేయాలనే లక్ష్యంతో అందరికీ అందుబాటులో ఉండేలా తమ సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ సాధనాల నిశాంత్ పాల్గొన్నట్లు వెల్లడించారు.

విభజనతో దగాపడిన ఆంధ్రులను మేలుకొలుపుదాం

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర విభజనతో దగాపడిన ఆంధ్రులను మేలుకొలుపుదామని జై ఆంధ్ర ఉద్యమ సంస్థ నాయకులు జై ఆంధ్ర వైవీఎస్ మహదేవ పిలుపునిచ్చారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఏకాదండయ్య సమావేశ మందిరంలో జై ఆంధ్ర ఉద్యమ సంస్థతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేష్ కుమార్, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం నాయకులు రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దగాను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా ఆందోళనలే సమస్యలకు పరిష్కారమని చెప్పారు. గంగవరం పోర్టు బాధితుల సంఘం వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్‌కి కూడా బ్యాంకు లోనులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులు మేయర్‌ను సంపత్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి బ్యాంకు నుంచి లోనులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన మేయర్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తుందని, ఉద్యోగులకు మేలు చేకూరే విధంగా బ్యాంకుల ద్వారా లోను ఇచ్చేలా బ్యాంకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధు, అసోసియేషన్ నాయకులు ఏసుబాబు, నరేష్, నాగేశ్వర రావు, సురేష్, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి రూ. 50 వేలు విలువ చేసే పలు వైద్య పరికరాలను రోగి కుటుంబ సభ్యులు అందజేశారు. కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన సి.హెచ్.రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడి పలు ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేక గతనెల 11న జీజీహెచ్‌కు వచ్చాడు. ఆర్థోపెడిక్ మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు రామకృష్ణకు ఐదుసార్లు ఆపరేషన్లు చేసి అతడు సాధారణంగా నడిచేలా చేశారు. ఈనెల 12న రామకృష్ణను డిశ్చార్జి చేయడంతో కృతజ్ఞతగా కుటుంబ సభ్యులు వైద్య పరికరాలు అందజేశారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తొడ ఎముక, కాలు ఎముకలు బయటకు రావడంతో ఐదు ఆపరేషన్లు చేసి రామకృష్ణను సాధారణ స్థితికి తీసుకొచ్చామన్నారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు వైద్యులు చేయలేని అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను ఆర్థోపెడిక్ వైద్యులు చేసి రోగులకు నూతన జీవితాలు ప్రసాదిస్తున్నారని, ఆర్థోపెడిక్ వైద్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ప్రొఫెసర్లు రవి, జోత్స్న పాల్గొన్నారు.

గుంటూరులో జగ్జీవన్ రామ్ సినిమా షూటింగ్

పాత గుంటూరు: సినీ దర్శకుడు దిలీప్ రాజా చిత్రీకరణలో మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమర యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను 'బాబూజీ' పేరుతో నిర్మిస్తున్న చిత్ర షూటింగ్ శనివారం రాజేంద్రనగర్‌లోని బ్యాంక్ కాలనీలో నిర్వహించారు. స్థానిక ఒక నివాసంలో జగ్జీవన్ రామ్, ఆయన కుమార్తె లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ మధ్య జరిగిన సన్నివేశాలను నటులతో చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు దిలీప్ రాజా విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నుంచి సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లుగా తెలిపారు. మీరాకుమార్ పాత్రలో సీనియర్ సినీ నటి తాళ్లూరి రామేశ్వరి, జగజ్జీవన్ రామ్ పాత్రను ఇండియన్ ఆర్మీ మాజీ సైనికుడు మిలటరీ ప్రసాద్ పోషిస్తున్నట్లు చెప్పారు.